


వైభవంగా ఆలయ వార్షికోత్సవం

నాదెండ్ల: చిలకలూరిపేట-నరసరావుపేట మార్గంమధ్యలో కనపర్రు బావి వద్ద ఉన్న వీరాంజనేయస్వామి ఆలయ 12 వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 504.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి గుడివాడకు చెందిన నల్లమోతు శ్యామలదేవి రూ. లక్ష విరాళాన్ని అందజేశారు.

న్యూస్‌రీల్

సదరం క్యాంపు 20కి మార్పు

నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం పబ్లిక్ సెలవు దినం కావడంతో నరసరావుపేట ఏరియా ఆసుపత్రిలో నిర్వహించాల్సిన వికలాంగుల ధృవీకరణ పరీక్ష (సదరం) క్యాంప్‌ను ఈనెల 20వ తేదీకి మార్చబడిందని హాస్పిటల్ సూపరింటెండెంట్ మంత్రూనాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున 13న స్లాట్ కేటాయించబడిన వారు 20వ తేదీన రావాలని కోరారు.

ఘనంగా స్వామివారి కల్యాణం



నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట 2/7వ అడ్డరోడ్‌లోని గౌరీ విశ్వేశ్వరస్వామి వారి దేవాలయంలో స్వామివారి జన్మ నక్షత్రం పురస్కరించుకుని ఆదివారం కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. కల్యాణ ఉత్సవంలో యల్లాప్రగడ ప్రభాకర్‌శర్మ, పద్మజ, ఎస్వీ సుబ్బారావు, సుధారాణి, చింతలపాటి ఉమా మహేశ్వరరావు, హిమబిందు తదితర దంపతులచే అర్చక స్వామి విశ్వేశ్వరశర్మ కల్యాణం జరిపించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై, స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు జంధ్యాల సుబ్రమణ్యశాస్త్రి, మల్లిఖార్జునశర్మ, చక్రపాణి, గిరి, కల్యాణ్ పాల్గొన్నారు.

కేంద్రాల్లోకి మొబైల్స్ అనుమతించం

ప్రత్తిపాడు: పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్స్‌ను అనుమతించబోమని ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్ తెలిపారు. నేడు జరగనున్న ఎన్నికలకు సంబంధించిన వివరాలను ఆర్‌ఓ వెల్లడించారు. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకోవాలని కోరారు. ఓటర్లు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదించిన గుర్తింపు కార్డు లేదా ఐడీ కార్డులను వెంట తీసుకువెళ్లాలన్నారు. దివ్యాంగ ఓటర్లు ఓటు హక్కును సులభంగా వినియోగించుకునేలా వీల్ చైర్స్ సదుపాయాన్ని కల్పించినట్లు వివరించారు. ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఆర్‌ఓ కోరారు.

దుర్గమ్మ సేవలో విరూపాక్ష పీఠాధిపతి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను గుంటూరులోని శ్రీ శృంగేరీ శ్రీ విరూపాక్ష శ్రీపీఠానికి చెందిన జగద్గురు గంభీరానంద భారతీ మహాస్వామి ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన స్వామిజీకి ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గంభీరానంద భారతీమహాస్వామి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ప్రాంగణంలోని జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి నిర్వహిస్తున్న వేదిక వద్ద స్వామిజీకి యతీశ్వర పూజ, పాద పూజ నిర్వహించి దేవస్థానం తరపున నూతన వస్త్రాలు, పండ్లను ఈఓ దంపతులు సమర్పించారు. స్వామిజీ భక్తులకు అనుగ్రహభాషణ చేశారు. వేద పండితులు స్వామిజీకి వేదస్వస్తి పలికారు.

మెప్మా ఆర్పీలపై ప్రలోభాల వల



తెనాలి: మెప్మాలో రిసోర్స్ పర్సన్స్ (ఆర్‌పీ)గా పనిచేస్తున్న కొందరు మహిళలకు ప్రలోభపెట్టేందుకు ప్రతిపక్ష కూటమి నేతలు చేసిన ప్రయత్నం విఫలమైంది. తెనాలి కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ ఇంటికి అతి సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి ఇందుకు వేదికైంది. మధ్యాహ్నం కొందరు ఆర్పీలు అక్కడకు చేరుకున్నారు. ఆసుపత్రి ముందు తెనాలి మున్సిపాలిటీ అన్న నేమ్‌ప్లేట్‌తో పలు ద్విచక్ర వాహనాలు ఉండటం చూసి స్థానికులు మీడియాకు, పోలీసులకు ఫోన్లు చేశారు. అక్కడకు చేరుకున్న మీడియాతో మదర్స్ డే వేడుకలకు వచ్చామని ఆర్పీలు చెప్పారు. అప్పటికప్పుడు కేక్‌ను కూడా తెప్పించారు. అంతలో పోలీసులు రావటంతో చేసేదిలేక తిరుగుముఖం పట్టారు.

వార్ వన్ సైడ్

- జిల్లాలో ఖరారైన వైఎస్సార్ సీపీ ప్రభంజనం
- మరోసారి ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానం గెలుపు
- వైఎస్ జగన్ ఐదేళ్ల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు పట్టం కట్టేందుకు సిద్ధం
- సామాజిక సమీకరణలకు పెద్ద పీట
- వైఎస్సార్ సీపీ గెలుపు నల్లేరుపై నడకేనంటున్న రాజకీయ పరిశీలకులు
- ఓటమి భయంతో డీలాపడ్డ టీడీపీ అభ్యర్థులు

తన ఐదేళ్ల పాలనతో ఇది కదా ప్రజా ప్రభుత్వం అంటే అని నిరూపించుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి జై కొట్టేందుకు పల్నాడు ప్రజలు సిద్ధమయ్యారు. అభివృద్ధి, సంక్షేమంతో జిల్లా రూపురేఖలే మార్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని కొనసాగించేందుకు ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసేందుకు ఓటరన్న పోలింగ్ బూత్ ముందు క్యూలో నిలుచున్నాడు. గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి కార్యక్రమాలు ఈ ఐదేళ్లలో జరగడం, ముఖ్యంగా గ్రామాల రూపురేఖలు మారడం ప్రజల్లో జగన్ పాలన పట్ల సానుకూలత బలంగా కనిపిస్తోంది. దీంతో దూర ప్రాంతాలలో విద్య, ఉద్యోగాల కారణంగా ఉన్నవారు సైతం ఉత్సాహంగా వచ్చి తమ ఊరు రూపురేఖలు మార్చిన జగనన్నకు ఓటు ద్వారా మద్దతు తెలిపేందుకు పెద్ద సంఖ్యలో గ్రామాలకు వచ్చారు.



సాక్షి, నరసరావుపేట: జిల్లాలో 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించింది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు క్లీన్ స్వీప్ చేశారు. తెలుగుదేశం పార్టీ అడ్రస్ గల్లంతైంది. ఐదేళ్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివక్షలేని పాలన చూసి మరోసారి 2019 ఫలితాలే 2024 ఎన్నికల్లో పునరావృత్తమవుతాయన్న భావన అందరిలోనూ నెలకొంది. వైఎస్సార్ సీపీ పాలన పట్ల అన్ని వర్గాల ప్రజలు సానుకూలంగా ఉన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం కల్పించడంతో వైఎస్సార్ సీపీ గెలుపు నల్లేరుపై నడకేనంటున్న వాదన బలంగా వినిపిస్తోంది.

పేటలో మనోహరుడే



చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ తరపున కావటి మనోహర్‌నాయుడు, టీడీపీ తరపున ప్రత్తిపాటి పుల్లారావు పోటీ పడుతున్నారు. మంత్రిగా ఉన్న సమయంలో ప్రత్తిపాటి పుల్లారావు అరాచకాలు, అక్రమాలు అన్ని ఇన్నీ కావు. ముస్లిం, కాపు, ఎస్సీ సామాజికవర్గానికి చెందిన ఓటర్లు అధికంగా ఉండటం అధికారపార్టీకి అనుకూలం. మరోవైపు ఐదేళ్ల వైఎస్ జగన్ పాలనలో కులం, మతం వర్గం చూడకుండా ప్రభుత్వ పథకాల లబ్ధి కలగడంతో అన్ని వర్గాల నుంచి వైఎస్సార్ సీపీకి మద్దతు లభిస్తోంది. దీంతో కావటి మనోహర్ గెలుపు పక్కా అనే భావన నెలకొంది.

పిన్నెల్లికే చెన్నకేశవుని ఆశీస్సులు



మాచర్లలో వైఎస్సార్ సీపీ తరపున పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, టీడీపీ తరపున జూలకంటి బ్రహ్మారెడ్డి పోటీ పడుతున్నారు. ఈ ప్రాంత ప్రజల 70 ఏళ్ల చిరకాల కల అయిన వరికపూడిసెల ప్రాజెక్టు పనులు ప్రారంభించి వైఎస్సార్ సీపీ, పీఆర్కేలు ప్రజల మనసు గెలుచుకున్నారు. మరోవైపు జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలతో ఇక్కడి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర అన్ని వర్గాల పేదలు పెద్దఎత్తున లబ్ధి పొందారు. దీంతో ఈ ఎన్నికల్లో ఇక్కడ ఉన్న ప్రజల ఓట్లు అధికారపార్టీ అభ్యర్థికి పడనున్నాయి. ఇప్పటికే నాలుగుసార్లు వరుసగా గెలిచి ఐదోసారి భారీ మెజార్టీతో గెలవడానికి పిన్నెల్లి రామకష్ణారెడ్డి సిద్ధంగా ఉన్నారని అన్ని సర్వేలలో తేటతెల్లమవుతోంది. జూలకంటి గెలిస్తే ఫ్యాక్షన్ సంస్కృతి మళ్లీ వస్తుందన్న భయం మాచర్ల ప్రజల్లో నెలకొంది.

ఎంపీ స్థానం వైఎస్సార్‌సీపీదే



నరసరావుపేట పార్లమెంట్ స్థానం నుంచి వైఎస్సార్ సీపీ తరపున డాక్టర్ పి అనిల్‌కుమార్ యాదవ్, టీడీపీ తరపున లావు శ్రీకృష్ణదేవరాయలు పోటీ చేస్తున్నారు. నరసరావుపేట పార్లమెంట్ చరిత్రలో ఇప్పటివరకు బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ఎంపీగా గెలిచింది లేదు. దీన్ని మార్చాలన్న ఉద్దేశంతో బడుగు బలహీనవర్గాలకు చెందిన మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌కు వైఎస్ జగన్ అవకాశం ఇచ్చాడు. దీంతో జిల్లాలోని యాదవులతోపాటు అన్ని బీసీ వర్గాలు ఆయన్ను అక్కున చేర్చుకుంటున్నాయి. దీంతో తొలి బీసీ వర్గానికి చెందిన ఎంపీగా అనిల్ గెలిచి చరిత్ర సృష్టించడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. టీడీపీలోకి వెళ్లిన లావుకు ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల నుంచి ఏమాత్రం సహకారం అందడం లేదు.

గెలుపు బాటలో నంబూరు



పెదకూరపాడు నుంచి వైఎస్సార్ సీపీ తరపున నంబూరు శంకరరావు, టీడీపీ తరపున భాష్యం ప్రవీణ్‌లు పోటీ చేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న బెల్లంకొండ-అమరావతి రోడ్డు, కృష్ణానదిపై బ్రిడ్జిలు, పెద్ద స్థాయిలో ఆసుపత్రుల, విద్యా సంస్థల భవనాల నిర్మాణాలతో అభివృద్ధికి నోచుకోని పెదకూరపాడులో అభివృద్ధి అంటే ఏమిటో పరిచయం చేసినట్టుఅయ్యింది. శ్రీధర్ వర్గం, మిత్రపక్షాలైన జనసేన, బీజేపీలు ఏమాత్రం సహకరించకపోవడం భాష్యంను బరిలో నుంచి తప్పించినట్టయ్యింది. మరోవైపు ప్రవీణ్ అహంకార ప్రవర్తనతో సొంతపార్టీనేతలే ఛీదరించుకుంటున్నారు. దీంతో కోట్లు గుమ్మరించి గెలుద్దామని ఆశగా వచ్చిన ప్రవీణ్ ఓటమి మూటగట్టుకోవాల్సిందేనన్న వాదన నియోజకవర్గంలో బలంగా వినిపిస్తోంది.

బొల్లాకు జై కొడుతున్న జనం



వినుకొండ నియోజకవర్గంలో అధికారపార్టీ తరపున బొల్లా బ్రహ్మనాయుడు, టీడీపీ తరపున జీవీ ఆంజనేయులు పోటీ పడుతున్నారు. ఇక్కడ నుంచి 2019లో ఎమ్మెల్యేగా గెలిచిన బొల్లా గతంలో ఎన్నడూ లేని విధంగా వినుకొండలో అభివృద్ధి పనులు చేపట్టారు. పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారం, రోడ్ల విస్తరణ, రైల్వే అండర్‌పాస్‌లు నిర్మాణం, కొండపై దేవాలయం అభివృద్ధి, భూ కబ్జాలకు అడ్డుకట్ట వేయడం వంటి కారణాలతో బొల్లాకు ప్రజలు జై కొడుతున్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు గతంలో చేసిన అరాచకాలు, అక్రమాలు వెంటాడుతున్నాయి. ఈ నియోజకవర్గంలో గత ప్రభుత్వకాలంలో జన్మభూమి కమిటీల పేరిట చేసిన ఘోరాలు తలుచుకొని మరోసారి వైఎస్సార్ సీపీ అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడుని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

అంబటికే అందలం



సత్తెనపల్లిలో వైఎస్సార్‌సీపీ తరపున అంబటి రాంబాబు, టీడీపీ తరపున కన్నా లక్ష్మీనారాయణ పోటీ చేస్తున్నారు. మంత్రి అంబటి రాంబాబు చేసిన పలు అభివృద్ధి పనులు ఆయనను మరోసారి గెలిపించేందుకు ఉపయోగపడుతోంది. వైఎస్ జగన్ ప్రభుత్వంలో అందిన సంక్షేమ ఫలాలు అంబటి గెలుపుకు శ్రీరామరక్ష కానున్నాయి. టీడీపీ హయాంలో సత్తెనపల్లిలో చేసిన అన్యాయాలు, అక్రమాలు కన్నాను వెంటాడుతున్నాయి.

హ్యాట్రిక్ దిశగా గోపిరెడ్డి



నరసరావుపేటలో వైఎస్సార్ సీపీ తరపున గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, టీడీపీ తరపున చదలవాడ అరవింద్‌బాబులు పోటీ చేస్తున్నారు. మూడోసారి గెలుపొంది హ్యాట్రిక్ కొట్టేందుకు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సిద్ధమవుతున్నారు. జిల్లా కేంద్రంతోపాటు విద్య, వైద్య రంగంలో జరిగిన అభివృద్ధి గోపిరెడ్డికి బలంగా కానుంది. నరసరావుపేటలో 20 ఏళ్లుగా టీడీపీ గెలుపు ముఖం చూడలేదు. మరోసారి నిరాశ తప్పదన్న భావన ఆ పార్టీలో నెలకొంది.

గురజాల 'కాసు'దే



గురజాలలో వైఎస్సార్ సీపీ తరపున కాసు మహేష్‌రెడ్డి, టీడీపీ తరపున యరపతినేని శ్రీనివాసరావు బరిలో నిలిచారు. అధికారంలో ఉన్నప్పుడు మైనింగ్‌తో ప్రభుత్వ ఆస్తిని విచ్చలవిడి దోపిడీ చేసి రూ.వందల కోట్లు దోచుకొని సీబీఐ కేసులు ఎదుర్కొంటున్న యరపతినేని పట్ల గురజాల ప్రజలు విముఖంగా ఉన్నారు. మరోవైపు 2019 ఎన్నికల్లో గెలిచిన కాసు మహేష్‌రెడ్డి ఓ వైపు ప్రజలకు భరోసా నిస్తూనే అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరువ చేశారు. పిడుగురాళ్లలో మెడికల్ కళాశాల, వాటర్ గ్రిడ్ పనులు, నేషనల్ హైవేలు, బైపాస్‌రోడ్ల నిర్మాణం వంటివాటితో తన మార్కు పనితీరును కాసు చూపారు. దీంతో మరోసారి గురజాలలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమన్న సంకేతాలు వినిపిస్తున్నాయి.

నేడే ఓట్ల పండుగ

- జిల్లాలో 17,20,526 మంది ఓటర్లు
- జిల్లాలో పురుషుల కన్నా మహిళా ఓటర్లు 40,403 మంది అధికం
- జిల్లాలో 1,926 పోలింగ్ కేంద్రాలు
- పోలింగ్ విధుల్లో 13,035 మంది సిబ్బంది
- పోలింగ్ కేంద్రాలకు చేరిన ఈవీఎంలు
- సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా
- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్

సాక్షి, నరసరావుపేట: ఐదేళ్లకు ఓసారి వచ్చే ఓట్ల పండుగ వచ్చింది. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం జరుగుతోంది. ఉదయం ఏడు నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు అన్ని ఇప్పటికే జిల్లా ఎన్నికల అధికార యంత్రాగం పూర్తి చేసింది. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ల నుంచి ఈవీఎంలు, వీవీప్యాట్‌లను పోలింగ్ సిబ్బంది ద్వారా, ప్రత్యేక పోలీసు బందోబస్తుతో జిల్లాలోని 1,926 పోలింగ్ కేంద్రాలకు చేర్చారు. వీటితోపాటు మూడు అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈవీఎంలు మొరాయించడం, ఇతర ఇబ్బందులు పరిష్కారానికి జిల్లా వ్యాప్తంగా 187 మంది సెక్టార్ ఆఫీసర్‌లను నియమించారు. 466 మంది మైక్రో అబ్జర్వర్లు పనిచేస్తున్నారు. మొత్తం మీద 13,035 మంది పోలింగ్ సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా తాగునీరు, వైద్య సదుపాయం, ఎండ నుంచి ఉపశమనం కోసం పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్‌లు వేశారు.

మహిళ ఓటర్లే కీలకం

జిల్లాలో మొత్తం 17,20,526 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 8,39,967 మంది, స్త్రీలు 8,80,370 మంది ఉన్నారు. పురుషుల కన్నా మహిళామణుల ఓట్లు జిల్లాలో 40,403 అధికంగా ఉన్నాయి. దీంతో మహిళల ఓట్లు కీలకం కానున్నాయి. గురజాల నియోజకవర్గంలో అత్యధికంగా 2,71,913 ఓట్లు ఉన్నాయి. అత్యల్పంగా చిలకలూరిపేటలో 2,25,277 ఓట్లు ఉన్నాయి. ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకొనేందుకు చివరి వరకు ప్రధాన పార్టీలు ప్రయత్నం చేస్తున్నాయి.

నియోజకవర్గం	తుది పోరులో అభ్యర్థులు
నరసరావుపేట పార్లమెంట్	15
పెదకూరపాడు	11
చిలకలూరిపేట	25
నరసరావుపేట	14
సత్తెనపల్లి	15
వినుకొండ	14
గురజాల	13
మాచర్ల	15
మొత్తం	122



నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాలలో మెటీరియల్ తీసుకునేందుకు సమావేశమైన పీఓలు, ఏపీఓలు, సిబ్బంది

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	సెక్టార్లు	పీఓలు	ఏపీఓలు	ఓపీఓలు	మైక్రో అబ్జర్వర్లు	మొత్తం
పెదకూరపాడు	266	27	293	293	1,154	53	1,793
చిలకలూరిపేట	241	25	266	266	1,047	39	1,618
నరసరావుపేట	246	22	271	271	1,065	84	1,691
సత్తెనపల్లి	274	31	302	302	1,180	26	1,810
వినుకొండ	299	27	329	329	1,278	95	2,031
గురజాల	304	27	335	335	1,309	92	2,071
మాచర్ల	299	28	329	329	1,286	77	2,021
మొత్తం	1,929	187	2,125	2,125	8,319	466	13,035



నరసరావుపేటలోని మున్సిపల్ గరల్స్ హైస్కూలులో ఏర్పాటుచేసిన టెంట్లు

బరిలో 122 మంది...

పల్నాడు జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలలో మొత్తం 107 మంది తుది పోరులో నిలిచారు. అత్యధికంగా చిలకలూరిపేటలో 25 మంది పోటీలో నిలిచారు. ఇక్కడ 15 మంది కన్నా ఎక్కువ మంది అభ్యర్థులు బరిలో ఉండటంతో రెండు ఈవీఎం బ్యాలెట్ యూనిట్లు వినియోగించనున్నారు. అత్యల్పంగా పెదకూరపాడులో 11 మంది పోటీలో ఉన్నారు. నరసరావుపేట పార్లమెంట్ స్థానానికి మొత్తం 27 నామినేషన్లు దాఖలవ్వగా చివరికి బరిలో 15 మంది నిలిచారు.

557 సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో 1,926 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో 557 సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అత్యధికంగా గురజాలలో 174, మాచర్లలో 151 కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో పెదకూరపాడు, గురజాల, మాచర్ల, వినుకొండ నియోజకవర్గాలలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో 100 శాతం వెబ్‌కాస్టింగ్ నిర్వహించనున్నారు. మిగిలిన చోట్ల 70 శాతం వరకు చేయనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎండకు ఓటర్లు ఇబ్బంది పడకుండా షామియానాలు, తాగునీరు, మజ్జిగ సౌకర్యం కల్పిస్తున్నారు. పోలింగ్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్ర బలగాలు, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలు, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలను పోలింగ్ కేంద్రాల వద్ద సుమారు 4 వేల మందికి పైగా మోహరిస్తున్నారు.

ప్రశాంత పోలింగ్‌కు ఏర్పాట్లు

- పోలింగ్ సామగ్రి పంపిణీ పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి
- పీవోలు, ఏపీవోలకు పలు సూచనలు

నరసరావుపేట: నరసరావుపేటలో ప్రశాంత పోలింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని ఎన్నికల సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ చేసేందుకు ఎస్ఎస్ఎన్ కళాశాలలో చేసిన ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. అక్కడకు వచ్చిన పీవోలు, ఏపీవోలతో ఏర్పాట్ల గురించి మాట్లాడారు. వారికి పలు సూచనలు, జాగ్రత్తలు చెప్పారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,30,572 మంది ఓటర్లు ఓటు వేసేందుకు 246 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1929 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటుచేయడంతోపాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు 10,800 మంది మీద బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు అక్రమంగా తరలిస్తున్న రూ.5.9కోట్ల విలువైన నగదు, మద్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేస్తూ మొదటి రెండు గంటల్లోనే పోలింగ్ తప్పకుండా ప్రారంభించాలని, లేని పక్షంలో ఎన్నికల కమిషన్‌కు పోలింగ్ సిబ్బంది సంజాయిషీ ఇచ్చుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి పి.సరోజిని, నోడల్ అధికారి ఆంజనేయులు పాల్గొన్నారు.



పీవోలు, ఏపీవోలతో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్



మాచర్లలో బస్సు ఎక్కుతున్న సిబ్బంది



చిలకలూరిపేటలో మెటీరియల్ తీసుకుని కేంద్రానికి బయలేరిన సిబ్బంది

బాపట్ల చేరుకున్న ప్రత్యేక పరిశీలకులు మిశ్రా

బాపట్ల: ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించేందుకు ఏపీ ప్రత్యేక పరిశీలకులు రామ్మోహన్ మిశ్రా ఆదివారం బాపట్లకు చేరుకున్నారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిమళ సింగ్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎన్నికల పోలీస్ పరిశీలకులు కెప్టెన్ అయ్యప్ప, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మర్యాదపూర్వకంగా ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై రాష్ట్ర ప్రత్యేక, సాధారణ పరిశీలకులకు జిల్లా కలెక్టర్ నివేదిక అందించారు. ఆయన వెంట జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, నోడల్ అధికారులు ఉన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్య జయంతి



ఆదిశంకరాచార్యులు విగ్రహానికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం కొలువైన ఇంద్రకీలాద్రిపై జగద్గురు శ్రీ ఆది శంకరాచార్య జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని చిన్న గాలిగోపురం ఆవరణలో ఉన్న లక్ష్మీగణపతి స్వామి వారి మందిరం వద్ద పూజా కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు ఆది శంకరాచార్య విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు, శంకర పూజ, యతి వందనం జరిపించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ ఈఓ కె.ఎస్. రామరావు పాల్గొన్నారు. ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ పర్యవేక్షణలో వైదిక కమిటీ సభ్యులు యజ్ఞనారాయణమూర్తి, కోట ప్రసాద్, శంకర శాండిల్య, రంగావజ్జుల శ్రీనివాసశాస్త్రి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. చింతలపాటి ఆంజనేయ ఘనా పాటి, పురాణ పండిత్ చింతలపాటి వెంకటేశ్వర శర్మలు ఆది శంకరాచార్యుల వైశిష్ట్యం గురించి భక్తులకు వివరించారు. సాయంత్రం నగరోత్సవాన్ని నిర్వహించగా, మహా మండపం నుంచి ఊరేగింపు ప్రారంభమైంది. మహా మండపం నుంచి కనకదుర్గనగర్, రథం సెంటర్, కెనాల్‌రోడ్డు, వినాయకుడి గుడి, రథం సెంటర్, ఘాట్‌రోడ్డు మీదగా అమ్మవారి ఆలయానికి చేరింది. నగరోత్సవంలో ఆలయ అధికారులు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా స్వామివారి కల్యాణం



నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట 2/7వ అడ్డ రోడ్‌లోని గౌరీ విశ్వేశ్వరస్వామి వారి దేవాలయంలో స్వామివారి జన్మ నక్షత్రం పురస్కరించుకుని ఆదివారం కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. కల్యాణ ఉత్సవంలో యల్లాప్రగడ ప్రభాకర్‌శర్మ, పద్మజ, ఎన్వీ సుబ్బారావు, సుధారాణి, చింతలపాటి ఉమా మహేశ్వరరావు, హిమబిందు తదితర దంపతులచే అర్చక స్వామి విశ్వేశ్వర శర్మ కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై, స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు జంధ్యాల సుబ్రమణ్యశాస్త్రి, మల్లిఖార్జునశర్మ, చక్రపాణి, గిరి, కల్యాణ్ పాల్గొన్నారు.

ఆసియన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మెరిసిన షబీనా

హాంకాంగ్‌లో జరిగిన పోటీల్లో నాలుగు బంగారు పతకాలు కైవసం



జాతీయ పతాకంతో షేక్ షబీనా

తెనాలి: హాంకాంగ్‌లో జరిగిన ఆసియన్ ఎక్విప్డ్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ కమ్ ఆసియన్ యూనివర్సిటీ కప్–2024 పోటీల్లో తెనాలికి చెందిన పవర్‌లిఫ్టర్ షేక్ షబీనా మెరిసింది. ఈనెల 6నుంచి 11వ తేదీ వరకు జరిగిన ఈ పోటీల్లో చివరిరోజు జూనియర్ విభాగంలో పోటీపడిన షబీనా స్క్వాట్, బెంచ్‌ప్రెస్, డెడ్‌లిఫ్ట్‌లో బంగారు పతకాలను సాధించింది. మూడు విభాగాల్లో కలిపి టోటల్‌లోనూ మరో పతకంతో మొత్తం నాలుగు బంగారు పతకాలను సాధించినట్టు కోచ్ షేక్ సంధాని తెలిపారు. గత రెండేళ్లుగా పవర్‌లిఫ్టింగ్‌లో నిలకడగా విజయాలను సాధిస్తున్న షబీనా గత ఏడాది కేరళలో జరిగిన ఆసియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లోనూ ఇదే రీతిలో నాలుగు బంగారు పతకాలను కైవసం చేసుకుంది. అంతకుముందు హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లోనూ మూడు బంగారు పతకాలు, రజత పతకం సాధించింది. అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటాలని అభిలషించిన షబీనా, ఆసియా పోటీల్లో వరుసగా రెండేళ్లు నాలుగేసి బంగారు పతకాలను గెలుచుకోవడం విశేషం.

అమరావతి అభివృద్ధిపై బాబు పాతపాటే

- విజయవాడ, గుంటూరుకు మొండిచేయి చూపేందుకా?
- రెండు నగరాల పరిసర ప్రాంతాలకు రిక్త హస్తమేనా
- 29 గ్రామాల్లో రియల్ వ్యాపారానికి ప్రణాళికే కదా
- గ్రీన్‌జోన్ పేరిట ఆనాడు టీడీపీ చేసింది అదేగా
- భవన నిర్మాణాలకు అనుమతులూ ఇవ్వలేదు
- ఆ అయిదేళ్లు నష్టపోయామని వాపోయిన నగరవాసులు
- అందుకే గుంటూరు, కృష్ణా జిల్లాల్లో టీడీపీకి దారుణ ఫలితాలు
- మళ్లీ మోసానికి తెరతీసిన చంద్రబాబు



సాక్షి ప్రత్యేక ప్రతినిధి: అమరావతి రాజధాని అభివృద్ధి పేరిట కష్టా, గుంటూరు జిల్లాల ప్రజలను మరోసారి మోసగించడానికి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు తెరతీశారు. ముఖ్యంగా విజయవాడ, గుంటూరు నగరాలతో పాటు పరిసర ప్రాంతాల వారిని మోసపు మాటలతో మభ్యపెట్టే ప్రయత్నాలు ఆరంభించారు. గత సాధారణ, కార్పొరేషన్, మునిసిపల్ ఎన్నికల్లో రెండు నగరాలు, వాటికి చుట్టుపక్కల ఉన్న నియోజక వర్గాల ఓటర్లు తెలుగుదేశంకు గట్టిగా బుద్ధి చెప్పినా ఒక వేళ తమ కూటమి గెలుపొందితే అమరావతిని అభివృద్ధి చేస్తానంటూ మళ్లీ పాతపాటే పాడుతున్నారు. 2014–2019 మధ్య కాలంలో ప్రపంచం మెచ్చే రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దుతానంటూ ఓవైపు భ్రమలు కల్పిస్తూ మరోవైపు గ్రీన్‌జోన్ పేరిట విజయవాడ, గుంటూరు నగరాలతో పాటు పరిసర నియోజక వర్గాల ప్రగతిని దారుణంగా దెబ్బతీశారు. గ్రీన్ జోన్ తమకు శాపంగా మారిందని అప్పట్లో మాజీ మంత్రి, సీనియర్ రైతు నాయకుడు వడ్డే శోభనాద్రీశ్వరరావు తదితరులు వేదికలపై నుంచి ఎలుగెత్తి చాటిన సందర్భాలు ఉన్నాయి.

వ్యాపార ఎత్తుగడలో భాగమే గ్రీన్‌జోన్ : రియల్ వ్యాపార ఎత్తుగడలో భాగంగా రాజధాని ప్రాంతంగా ఎంపిక చేసిన 29 గ్రామాల్లో చంద్రబాబు, తన కోటరీ రియల్ వ్యాపారం పెంచుకోవడానికి వీలుగా ఆనాటి ఏపీసీఆర్‌డీఏ పరిధిలో వ్యవసాయం పరిరక్షణ పేరిట గ్రీన్‌జోన్ ఏర్పాటు చేశారు. గుంటూరు, తెనాలి, సత్తెనపల్లి, గుడివాడ, నందిగామ, జగ్గయ్యపేట, నూజివీడు, గన్నవరం నియోజ కవర్గాల పరిధిలోని 5,440 చదరపు కిలోమీటర్ల మేర ఈ జోన్ ఏర్పాటైంది. గ్రీన్‌జోన్ పరిధిలోని భూముల్లో భవన నిర్మాణాలకు అనుమతి ఉండదు. ఈ జోన్ పరిధిలో అనుమతించిన వాటిని మాత్రమే అభివృద్ధి చేయాల్సి ఉంటుందనే షరతు ఉండేది. క్యాపిటల్ జోన్ పరిధిలో ఉన్న భూములు విక్రయించాలన్నా, కొనుగోలు చేయాలన్నా స్థానిక ఎమ్మార్వో, సబ్ రిజిస్ట్రార్ల నుంచి నిరభ్యంతర ధృవీకరణ పత్రం (నో అబ్జక్షన్ సర్టిఫికెట్- ఎన్‌ఓసి) పొందాలి. ఈ నిబంధన తమను ఇబ్బందులకు గురిచేయడానికేనని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు కూడా.

గ్రీన్‌జోన్ వల్ల తగ్గిన స్థిరాస్తి వ్యాపారం

5,440 చదరపు కిలోమీటర్ల పరిధిలో గ్రీన్ జోన్ ఏర్పాటుతో ఆ పరిధిలోని ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారం బాగా పడిపోయింది. నగర, పట్టణ, నివాస ప్రాంతాల్లో క్రయవిక్రయాలు సాగక యజమానులు ఇబ్బందులు పడ్డారు. తమ అత్యవసర పనులకు కూడా భూములను విక్రయించుకోలేని దుస్థితి భూయజమానులకు ఏర్పడింది. దీనిపై పలు రకాల ఆందోళనలు జరిగాయి. 1700కు పైగా అభ్యంతరాలు ఏపీసీఆర్‌డీఏకి అప్పట్లో అందాయి. గ్రీన్‌జోన్‌ను రద్దు చేయాలనే వినతులు వచ్చాయి. అగ్రికల్చర్ జోన్ 1,2,3 ల నుంచి తమ పరిధిలోని ప్రాంతాలను తప్పించాలని స్థానిక ప్రజాప్రతినిధులు భూ యజమానులకు మద్దతుగా పలుసార్లు ఉన్నతాధికారులకు సూచించారు. తమ రాజకీయ ప్రయోజనాలకు, పార్టీకి దీర్ఘకాలిక నష్టం వాటిల్లుతుందని తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు వాపోయారు కూడా. దీనిపై రైతుల సందేహాలను తీర్చుతామంటూ గుంటూరు, కృష్ణా జిల్లాల్లో అవగాహనా కార్యక్రమాలను అధికారులు నిర్వహించారు. గ్రీన్ జోన్, అగ్రికల్చర్ జోన్‌ల మధ్య వ్యత్యాసం ఉందని, క్రమంగా అభివృద్ధి జరుగుతుందంటూ రైతులకు ఒప్పించడానికి అధికారులు చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు.

జగన్ సర్కారులో రద్దు

రాజధాని అమరావతి పరిధిలో ఉన్న గ్రీన్‌జోన్‌ను జగన్ సర్కార్ రద్దుచేసింది. ఈ నిర్ణయం వల్ల నివాస ప్రాంతాలకు 500 మీటర్లు దాటి కూడా అనుమతులు ఇవ్వడానికి సీఆర్‌డీఏకి అనుమతి లభించింది. ఈ నిర్ణయం వల్ల రాజధాని అమరావతిలో భూముల ధరలు బాగా పడిపోతాయని చంద్రబాబు, ఆయన బృందం తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. ఒకవేళ తాను అధికారంలోకి వస్తే అమరావతిని అభివృద్ధి చేస్తానని చంద్రబాబు వల్లెవేస్తున్నారు. కాగా గ్రీన్‌జోన్ కష్టాలు ఇంకా తొలగలేదని రైతులు అక్కడక్కడా వాపోతుండటం పరిశీలనాంశం. మళ్లీ రాజధాని అమరావతిని బూచిగా చూపించి ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో బాబుకు ఓటర్లు తమ ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు.

తమ భూముల ధరలు పెంచుకునేందుకే

తాడికొండ, పాత అమరావతి, పరిసర గ్రామాల్లో భూముల ధరలు తగ్గేలా, ప్రతిపాదిత రాజధాని గ్రామాల్లో భూముల ధరలు పెంచుకునేందుకు తమ ప్రాంతాలను గ్రీన్‌జోన్ పరిధిలోని తీసుకువచ్చారని రైతులు తీవ్రమైన ఆరోపణలు చేశారు. చంద్రబాబు మోసపు ఎత్తుగడలను గుర్తించినందునే రాజధాని పరిధిలోకి వచ్చే తాడికొండ నియోజకవర్గంలోని ఓటర్లు సైతం వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచారు. గుంటూరు, విజయవాడతో పాటు కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని మెజారిటీ స్థానాలు వైఎస్సార్‌సీపీకి దక్కాయి. గుంటూరు, విజయవాడ కార్పొరేషన్ల ఎన్నికల్లోనూ టీడీపీ మట్టికరిచింది.

పసిప్రాణాలను బలిగొన్న నిద్రమత్తు

- రాంగ్‌రూట్‌లో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు
- అక్కడికక్కడే ప్రాణాలు విడిచిన చిన్నారులు



ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు చిన్నారులు సంధ్య, అశ్విని



ప్రమాదంలో గాయపడిన బాలికను పైకి లేపుతున్న స్థానికులు

చినగంజాం: డ్రైవర్ నిద్రమత్తు ఇద్దరు చిన్నారుల ప్రాణాలను బలితీసుకుంది. హృదయ విదాకరమైన ఈ సంఘటన చినగంజాం రొంపేరు వంతెన సమీపంలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు, హైవే సిబ్బంది అందించిన సమాచారం ప్రకారం ఆదివారం ఉదయం 7.45 గంటల సమయంలో ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా రాంగ్‌రూట్‌లో వస్తున్న కారు ఢీకొట్టిన సంఘటనలో ఇరువురు చిన్నారులు మృతి చెందగా ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తికి కాలు విరిగింది. దీనికి సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే యల్లావుల వెంకటేశ్వర్లు ఉప్పుగుండూరులో స్వీట్లు తయారు చేసే పనిలో ఉంటున్నాడు. అతనిది బాపట్ల స్వగ్రామం కాగా 7 నెలలుగా ఉప్పుగుండూరులో నివాసముంటున్నాడు. అతనికి ముగ్గురు కుమార్తెలు యల్లావులు దేవి సంధ్య (12), జస్విత (9), అశ్విని (7) ఉన్నారు. ఆదివారం తన కుటుంబంతో కలిసి బాపట్లలో ఓటు వేసేందుకు బయలు దేరాడు. వెంకటేశ్వర్లు, అతని భార్య ఒక ద్విచక్ర వాహనంపై, మరొక ద్విచక్ర వాహనంపై అతనికి సోదరుడి వరుస అయిన వెంపరాల లక్ష్మణ్ అతనితో పాటు వెంకటేశ్వర్లు ముగ్గురు కుమార్తెలు బాపట్ల బయలు దేరారు. వారు రొంపేరు బ్రిడ్జి సమీపానికి వచ్చేసరికి చిన్నారుల తల్లిదండ్రులు ద్విచక్ర వాహనం వెనుకబడటంతో వారికోసం ఆగి వారు వచ్చిన తరువాత వీరి వాహనం బయలు దేరింది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న కారు రాంగ్ రూట్‌లో వచ్చి రోడ్డుకు ఎడమవైపున ఉన్న వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఆ సంఘటనలో యల్లావుల వెంకటేశ్వర్లు పెద్ద కుమార్తె దేవి సంధ్య, చిన్నకుమార్తె అశ్వినిలకు తీవ్రగాయాలయ్యాయి. మరొక కుమార్తె జస్విత సురక్షితం కాగా వాహనం నడుపుతున్న లక్ష్మణ్‌కు ఎడమ కాలు ఫ్యాక్చర్ అయింది. తీవ్ర గాయాలపాలైన ఇద్దరు చిన్నారులను చీరాల వైద్యశాలకు తరలించగా వారు అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. కాలు ఫ్యాక్చర్ అయిన లక్ష్మణ్‌ను మెరుగైన వైద్యచికిత్స నిమిత్తం గుంటూరు వైద్యశాలకు తరలించారు. పొన్నూరుకు చెందిన నరేంద్రరెడ్డి హైదరాబాద్‌లో న్యూట్రిషనర్‌గా పనిచేస్తూ ఆదివారం ఉదయం తన భార్య, చిన్నారితో కలిసి ఒంగోలులో ఓటు వేసే నిమిత్తం కారులో బయలుదేరాడు. రొంపేరు బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వారు ముగ్గురు సురక్షితంగా ఉన్నారు. తమ ఇద్దరు చిన్నారులు తమ కళ్ల ముందే ప్రమాదానికి గురై చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రమాదంలో చనిపోయిన చిన్నారులకు చీరాల వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్‌ఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

శాంతిభద్రతల పర్యవేక్షణకు 4వేలమంది సిబ్బంది

- 19 కంపెనీలు కేంద్ర బలగాలు
- పల్నాడురోడ్డులో ఫ్లాగ్ మార్చ్
- పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్పీ



పల్నాడు రోడ్డులో కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

నరసరావుపేట: జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించే సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో శాంతిభద్రతలు పర్యవేక్షణకు 19 బెటాలియన్ల సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో కలిపి సుమారుగా 4వేల మందిని కేటాయించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, జిల్లా ఎస్పీ ఎల్.శివశంకర్, జి.బిందుమాధవ్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం పల్నాడు రోడ్డులోని పల్నాడు బస్టాండ్ సెంటర్ నుంచి పోలీసు, సీఆర్‌పీఎఫ్ కేంద్ర బలగాలతో మల్లమ్మ సెంటర్ వరకు పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలగాలను పోలీస్‌స్టేషన్ వారిగా క్యాటగిరీ వైజ్ నియమించడం జరిగిందన్నారు. పోలింగ్‌కు కావాల్సిన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ప్రజల్లో భరోసా కలిగించి ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా కేంద్ర బలగాలు ఫ్లాగ్‌మార్చ్ చేశాయన్నారు. గత నెలరోజులుగా సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. ప్రజలందరికీ ఫ్రీ అండ్ ఫెయిర్ పోలింగ్ పరిస్థితులు కల్పించామని, ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఓటర్లలో చైతన్యం కోసం మోడల్ పోలింగ్ కేంద్రాలు

తెనాలి పట్టణం, మండలంలో ఏడు కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు



చినరావూరులోని ఆదర్శ పోలింగ్ కేంద్రం

తెనాలి రూరల్: ప్రజలందరూ పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ తమ ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం అధికారులు అన్ని చర్యలూ చేపడుతున్నారు. ముఖ్యంగా ఓటర్లలో చైతన్యం కలిగించడంతో పాటు ఓటింగ్ ప్రక్రియను ఆహ్లాదకరంగా మార్చేలా కొన్ని చోట్ల మోడల్ పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేశారు. తెనాలి పట్టణంలో వివిధ ప్రాంతాల్లో నాలుగు ఆదర్శ పోలింగ్ కేంద్రాలు, రూరల్ గ్రామాల్లో మరో మూడు ఆదర్శ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సుల్తానాబాద్‌లోని 54వ పోలింగ్ కేంద్రాన్ని యువజన మోడల్ పోలింగ్ స్టేషన్‌గా, ఐతానగర్‌లోని ఎన్‌ఎస్‌ఎస్‌ఎం హైస్కూల్‌లో పిఎస్ నెం 110ని పీడబ్ల్యూడీ మోడల్ పోలింగ్ కేంద్రంగా, ఎర్రబ్రిడి పోలింగ్ కేంద్రాన్ని మహిళా మోడల్ పోలింగ్ కేంద్రంగా, చినరావూరులోని వాసిరెడ్డి లక్ష్మీపతి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను ఆదర్శ పోలింగ్ కేంద్రంగా సిద్ధం చేశారు. ఆయా ఆదర్శ పోలింగ్ కేంద్రాల ద్వారా ఓటర్లను చైతన్య పరిచే విధంగా ఈ ఏర్పాట్లు చేశారు. ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా చలువ పందిళ్లనూ ఏర్పాటు చేశారు. పోలింగ్ బూత్‌లను ఆయా మోడల్ పోలింగ్ కేంద్రానికి తగ్గట్టుగా అలంకరించారు.

చీరాలలో సమస్యాత్మక గ్రామాలివే

చీరాల: చీరాల నియోజకవర్గంలోని చీరాల మండలంలో 15 గ్రామ పంచాయతీలు, వేటపాలెం మండలంలో 9 గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలో 33 వార్డులు ఉన్నాయి. అయితే 2019లో చీరాల నియోజకవర్గంలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 111కి చేరాయి. ప్రస్తుతం 2024 సార్వత్రిక ఎన్నికలకు నియోజక వర్గంలో 167 పోలింగ్ కేంద్రాల ఎన్నికల్లో అత్యంత సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ కేంద్రాలను నిర్ధారించారు. చీరాల మండలంలోని గవినివారిపాలెం, విజయనగర్‌కాలనీ, పాతచీరాల, చీరాలనగర్, కొత్తపాలెం, దేవినూతల, వాడరేవు, బోయినవారిపాలెం గ్రామాలను అధికారులు గుర్తించారు. అలానే వేటపాలెం మండలంలోని పందిళ్లపల్లి, పాపాయిపాలెం, చల్లారెడ్డిపాలెం, కొత్తరెడ్డిపాలెం, మంకెనవారిపాలెం, చీరాల పురపాలక సంఘంలో హారిస్‌పేట, జయంతిపేట, శృంగారపేట, ఉజిలీపేట, శాంతినగర్ తదితర ప్రాంతాలను సమస్యాత్మకంగా అధికారులు నిర్ధారించారు.

భగ్గుమన్న దళితులు



అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు

లక్ష్మీపురం: గుంటూరు తెలుగుదేశం పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవి భర్త రామచంద్రయ్య నోటి దురుసుగా ప్రవర్తించారు. దళితుల పట్ల పరుష పదజాలంతో వ్యాఖ్యలు చేయడంతో వారు ఆందోళనకు దిగారు. పశ్చిమ నియోజకవర్గం కొబోల్డ్‌పేట ప్రాంతంలో దళిత వర్గాలకు సంబంధించి రామచంద్రయ్య రాత్రి అక్కడ చేరుకుని వారిపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేశారు. రామచంద్రయ్య వ్యాఖ్యలతో మండిపడ్డ స్థానికులు ఆదివారం రాత్రి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళనకు దిగారు. దళితుల ఓట్లు తనకు అవసరం లేదంటూ వారిపై నోరు పారేసుకోవడంతో దళిత వర్గాలు మనస్థాపాన్ని గురై ఆందోళన చేపట్టారు. సుమారు గంటన్నరకు పైగా ఆందోళన జరిగింది. రామచంద్రయ్య క్షమాపణలు చెప్పాలంటూ దళిత వర్గాల సభ్యులు ఆందోళనకు దిగి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దళితుల పట్ల టీడీపీ నేతలు చిన్న చూపుతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. టీడీపీ అధినేత చంద్రబాబు దగ్గర నుండి ఆ పార్టీ కింద స్థాయినేతల వరకు దళితులంటే తొలి నుండి అవమానకరంగానే మాట్లాడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో సైతం చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దళితుల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని అన్న విషయాన్ని వారు గుర్తు చేశారు. విషయం తెలుసుకుని సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ టీడీపీ అభ్యర్థిగా మాధవి, రామచంద్రయ్య క్షమాపణ చెప్పాల్సిందేనని తేల్చిచెప్పారు. పోలీసులు స్థానిక ఎన్నికల నేపథ్యంలో సహకరించాలని కోరడంతో వివాదం సద్దుమణిగింది.

ఉద్యోగులకు సకల సౌకర్యాలు

- పూర్తిస్థాయి వసతులతో సిద్ధమైన పోలింగ్ కేంద్రాలు
- ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు మౌలిక వసతుల కల్పన
- పాఠశాలల్లో సౌకర్యవంతంగా విధుల నిర్వహణకు ఏర్పాట్లు
- కూర్చునేందుకు ఫర్నీచర్, అన్ని గదుల్లో సీలింగ్ ఫ్యాన్లు, ఎల్‌ఈడీ లైటింగ్ వ్యవస్థ
- పురుషులు, మహిళా ఉద్యోగులకు వేర్వేరుగా అందుబాటులో టాయిలెట్లు
- గుంటూరు జిల్లాలో 1,915 పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు
- ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు



గుంటూరు చౌత్రాలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్ పోలింగ్ కేంద్రం



గుంటూరు స్థంభాలగరువులోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం



నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో సీలింగ్ ఫ్యాన్లు, లైట్లు

గుంటూరు ఎడ్యుకేషన్: సంక్షేమం, అభివృద్ధి కలగలసిన ప్రజా రంజక పరిపాలనతో ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మార్కు అభివృద్ధి సార్వత్రిక ఎన్నికల్లోనూ స్పష్టంగా కనిపిస్తోంది. సోమవారం జరగనున్న ఎన్నికల నిర్వహణకు గుంటూరు జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాఠశాలలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో మౌలిక వసతులతో విధుల్లో పాల్గొనే అధికారులు, ఉద్యోగులు స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా విధులు నిర్వహించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా 289 ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో కనీస ప్రాథమిక మౌలిక వసతుల కల్పన కింద ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించింది. నియోజకవర్గానికి ఒక ఎంఈవోను నోడల్ అధికారిగా నియమించిన ఉన్నతాధికారులు ఎన్నికల సంఘ నిబంధనల మేరకు అవసరమైన పనులను పూర్తి చేయించారు. ఈ విధంగా జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,915 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటైన 289 పాఠశాలల్లో ఆర్వో వాటర్ ప్లాంటుతో తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్, ఫర్నీచర్ సదుపాయాలను స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్‌తో పూర్తి చేశారు. నాడు–నేడు మొదటి దశలో ఆధునీకరించిన పాఠశాలల్లో అన్ని రకాల వసతులు ఉండటంతో పాటు రెండో దశలో చేపట్టిన పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించారు. జిల్లాలోని 1,915 పోలింగ్ కేంద్రాల్లో 1,630 పోలింగ్ కేంద్రాలు పూర్తిగా విద్యాశాఖ పరిధిలో ఉన్నాయి. పోలింగ్ కేంద్రాల్లో 80 శాతానికి పైగా నాడు–నేడు ద్వారా అభివృద్ధి పర్చిన పాఠశాలల్లోనే ఉండటంతో ఆయా కేంద్రాల్లో వసతుల కల్పనకు పెద్దగా కష్టపడకుండా అన్ని వసతులు కల్పించింది. ఆదివారం పోలింగ్ సామగ్రితో వెళ్లిన ఉద్యోగులకు పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉన్న మౌలిక వసతులతో ఊపిరి పీల్చుకున్నారు.

అభివృద్ధి ప్రతిబింబాలు


వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మిస్తున్న ప్రాంతం


పిడుగురాళ్లలో మెడికల్ కళాశాల


కాకాని వద్ద జేఎన్‌టీయూఎన్ ప్రాంగణం

అభివృద్ధి మంత్రం

- పిడుగురాళ్లలో 600 పడకల ఆసుపత్రి, మెడికల్, నర్సింగ్ కళాశాల
- జేఎన్‌టీయూ కళాశాల భవన నిర్మాణం
- వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభం
- పల్నాడులో తాగునీటి సమస్య పరిష్కారం
- కొండవీడుకొండ రోడ్డు మార్గం, పర్యాటకంగా అభివృద్ధి
- వినుకొండ రామలింగేశ్వర స్వామి ఘాట్ రోడ్డు, ఆలయ పునర్నిర్మాణం
- యడ్లపాడు మండలంలో ఐటీసీ స్పైసెస్ పార్క్ విస్తరణ
- శ్రీ సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం
- పల్నాడు ప్రాంతంలో కొత్తగా మూడు నేషనల్ హైవేల నిర్మాణం


కొండవీడు కోట(ఫైల్)

సాక్షి, నరసరావుపేట: కృష్ణమ్మ చెంతనే ఉన్నా నీరందక, పంటలు పండక రైతులు...పనులు లేక కూలీలు...అపార ఖనిజ సంపద ఉన్నా పరిశ్రమలు లేక కార్మికులు... చదువుకునే తెలివితేటలు ఉన్నా సరైన విద్యాసంస్థలు లేవు, ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే వందల కిలోమీటర్లు రావాలి. ఈలోగా అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ విధంగా పల్నాడు జిల్లా ఇప్పటి వరకు అన్ని రంగాల్లోనూ వెనుకబడింది. గత పాలకులు పల్నాడు అభివృద్ధి ఏమాత్రం పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రలో పల్నాడు వెనుకబాటుతనాన్ని గుర్తించారు. తాను అధికారంలోకి రాగానే సంక్షేమంతోపాటు అభివృద్ధి ఫలాలను పల్నాడు ప్రజలకు అందించారు. పిడుగురాళ్లలో 600 పడకల ఆస్పత్రి, మెడికల్, నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. వరికపూడిశెల ప్రాజెక్టుకు అనుమతులు అడ్డంకిగా మారాయి. వాటిని తొలగించి పునాది రాయి వేశారు. చరిత్ర ప్రసిద్ధిగాంచిన కొండవీడు అభివృద్ధికి బాటలు వేశారు. నరసరావుపేటలో రూ.150 కోట్లతో జేఎన్‌టీయూ కళాశాల భవన నిర్మాణం పూర్తి చేశారు.

గ్రామ సచివాలయాలు : 416
వార్డు సచివాలయాలు :122
రైతు భరోసా కేంద్రాలు : 421
వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు : 306
బల్క్‌మిల్క్ సెంటర్లు : 196
డిజిటల్ లైబ్రరీలు : 96
ఎంఎస్‌ఎంఈలు : 4,327 (వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో స్థాపించినవి)
జిల్లాలో ఉన్న మొత్తం పరిశ్రమలు : 14,375

జేఎన్‌టీయూఎన్ ప్రాంగణం సిద్ధం

నరసరావుపేటరూరల్: మండలంలోని కాకాని వద్ద జేఎన్‌టియూఎన్ ఇంజినీరింగ్ కళాశాల భవనాలను రూ.150 కోట్లతో పూర్తిచేశారు. మూడేళ్లగా కాకాని ప్రాంగణంలో తరగతులు ప్రారంభమయ్యాయి. 1200మంది విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. ఇదే ప్రాంగణంలో యవతీ, యువకుల వసతి గృహాల నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయి. స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులు ప్రారంభమయ్యాయి. మరో ఏడాదిలో పూర్తిస్థాయిలో వసతులు విద్యార్థులు అందుబాటులోకి రానున్నాయి.

నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో 2019 నుంచి 2024 ఫిబ్రవరి వివిధ పథకాలతో లబ్ధి

పథకం	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధిపొందిన మొత్తం (రూ.కోట్లలో)
వైఎస్సార్ ఆసరా	2,76,925	573.52
జగనన్న అమ్మ ఒడి	1,92,598	977.45
జగనన్న చేదోడు	43,480	4348
వైఎస్సార్ చేయూత	95,534	430.43
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	63,843	95.77
జగనన్న తోడు	1,90,183	82.85
జగనన్న వసతి దీవెన	44,192	162.03
జగనన్న విద్యా దీవెన	48,143	362.64
వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా	982	8.89
వైఎస్సార్ కాపునేస్తం	45,001	67.57
వైఎస్సార్ నేతన్న నేస్తం	422	3.40
వైఎస్సార్ పింఛన్ కానుక	2,81,269	3,438.4
వైఎస్సార్ రైతు భరోసా	2,79,608	1,636
వైఎస్సార్ సున్నావడ్డీ పంట రుణాలు	83,856	23.63
వైఎస్సార్ వాహనమిత్ర	8,642	36.19
వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	2,24,559	523.14
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	1,03,497	53.18
వైఎస్సార్ బీమా	5,521	55.21
వైఎస్సార్ సున్నావడ్డీ	36,542	111.04
వైఎస్సార్ స్త్రీనిధి	93,258	435.28
నాన్ డీబీటీ...		
నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు	39,303	7,074.5
జగనన్న గోరుముద్ద	1,47,818	192.34
విద్యార్థులకు ట్యాబులు	22,220	72.22
జగనన్న విద్యా కానుక	2,12,025	42.32
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	1,20,176	291.36

హమారా జగన్

- ముస్లిం రిజర్వేషన్లపై బీజేపీ నిర్ణయంతో తీవ్ర వ్యతిరేకత
- బీజేపీ పొత్తుతో టీడీపీ,జనసేన నేతల్లోనూ ఆందోళన

సత్తెనపల్లి: కేంద్రంలోని ఎన్డీఏ కూటమి మూడోసారి అధికారంలోకి వస్తే దేశంలో ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో ముస్లిం మైనార్టీ వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. కేంద్రంలోని బీజేపీతో రాష్ట్రంలోని టీడీపీ, జనసేన పార్టీలు పొత్తు పెట్టుకోవడంతో ముస్లింలు ఆ పార్టీల వైఖరిని ఎండగడుతున్నారు. పాదయాత్ర ద్వారా ముస్లిం మైనార్టీల స్థితిగతులను తెలుసుకున్న మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాష్ట్రంలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో ముస్లిం మైనార్టీ వర్గాల ఎదుగుదలకు ఎంతో దోహదపడింది. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా తాము ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు అమలుకు కట్టుబడి ఉన్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేయడంతో ముస్లింల సంక్షేమంపై ఆయనకు ఉన్న చిత్తశుద్ధి వెల్లడవుతుంది.

రిజర్వేషన్లు ఉండాల్సిందే..



వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించి విద్య, ఉద్యోగాల్లో అవకాశం కల్పించారు. ఆయన బిడ్డ వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక మా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇటీవల విద్య, ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్లను కొనసాగిస్తానని ప్రకటించారు. ఎన్నికల సమయంలో బీజేపీ పెద్దలు ముస్లిం రిజర్వేషన్లపై వ్యాఖ్యలు చేయడం దేశానికే ప్రమాదకరం. ముస్లింలపై జగన్‌కు ఉన్న అభిమానానికి కృతజ్ఞతలు.

– షేక్ కరీమ్, ముస్లిం మైనార్టీ నాయకుడు

కూటమికి ఓటు వేస్తే రిజర్వేషన్లు రద్దు



ఎన్డీఏ కూటమిలో భాగంగా బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలకు ఓట్లు వేస్తే పరోక్షంగా ముస్లింలకు రిజర్వేషన్ల రద్దును ఒప్పుకున్నట్లుగానే భావించాలి. మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముస్లింల వెనుకబాటు తనాన్ని గుర్తించి 4 శాతం రిజర్వేషన్లు కొనసాగించారు. దీంతో అనేక మంది ముస్లింలకు ఉపాధి అవకాశాలు లభించాయి. ముస్లింలకు రిజర్వేషన్ల కొనసాగింపునకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేయడం అభినందనీయం.ముస్లింలు అంతా జగన్‌కు అండగా ఉండాలి.

–షేక్ నాగూర్ మీరాన్, మున్సిపల్ వైస్ చైర్మన్, సత్తెనపల్లి

సైకిల్‌కి ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లే



సైకిల్‌కు ఓటేస్తే బీజేపీకి ఓటు వేసినట్లే. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం బీజేపీకి ఆది నుంచి ఇష్టం లేదు. ముస్లింల రిజర్వేషన్లకు వ్యతిరేకమని బీజేపీ బహిరంగంగానే ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో బీజేపీతో జత కట్టిన టీడీపీ, జనసేన పార్టీలను నమ్మే పరిస్థితుల్లో ముస్లింలు లేరు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్ల వల్ల ఎంతోమంది ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారు. వైఎస్ జగన్ పాలనలోనే ముస్లింలకు రక్షణ ఉంది. ఈ ఎన్నికల్లో ముస్లింలు ఆలోచించి జగన్‌కు ఓటు వేయాలి.

–షేక్ తాహేర్ ఉన్నీసా, కౌన్సిలర్, సత్తెనపల్లి

వేలికి సిరా చుక్క...డిస్కౌంట్ అందుకో ఎంచక్కా

ప్రత్యేక డిస్కౌంట్లు ప్రకటించిన వ్యాపార సంస్థలు



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఓటర్లల్లో ఓటింగ్ శాతాన్ని పెంచాలనే సదుద్దేశంతో కొన్ని వ్యాపార సంస్థలు ఓటు వేసిన వారికి తమ సంస్థల్లో ప్రత్యేకంగా డిస్కౌంట్లు అందిస్తున్నాయి. ఓటు వేసిన తర్వాత చేతికి ఉన్న సిరా చుక్క ఆధారంగానే ఈ డిస్కౌంట్‌ను అందజేస్తామని ప్రకటించారు.

- విజయవాడ బందరు రోడ్డులోని ఒక వస్త్ర దుకాణం (ఓకే సిల్క్)లో షాపింగ్ చేసిన వారి బిల్లులో ఏకంగా 20 శాతం డిస్కౌంట్ ఇస్తామని ప్రకటించారు. ఈ నెల 14, 15 తేదీల్లో (మంగళ, బుధవారాలు) ఈ డిస్కౌంట్ ఆఫర్ ఉంటుందని ప్రకటించారు. ఒక మనిషికి ఒక బిల్లుకే ఈ డిస్కౌంట్ ఆఫర్ వర్తిస్తుంది.
- నగరంలోని ప్రముఖ కంటి ఆసుపత్రి (వాసన్ ఐ కేర్) వారు ఓటు వేసి సిరా చుక్క చూపిస్తే తమ హాస్పిటల్‌లో కన్సల్టేషన్ ఉచితంగా అందించడమే కాకుండా తర్వాత అవసరమైన వైద్య పరీక్షలు (మెడికల్ టెస్ట్), శస్త్రచికిత్సలపై పది శాతం డిస్కౌంట్స్‌ను అందజేస్తామని ప్రకటించారు. విజయవాడ నగరంలోనే కాకుండా గాజువాక, గుంటూరు, కాకినాడ, నెల్లూరు, తిరుపతి, వైజాగ్ కేంద్రాల్లో సైతం ఈ డిస్కౌంట్స్ అందుబాటులో ఉంటాయని ప్రకటించారు. మరి ఇంకెందుకు ఆలస్యం ఓటు హక్కు అనేది మన బాధ్యత ఆ బాధ్యతను నెరవేర్చిన తర్వాత ఈ డిస్కౌంట్స్‌ను ఉపయోగించుకోవచ్చు. పదండి పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకుందాం.

కృష్ణా నది మధ్యలో ఆరు పోలింగ్ కేంద్రాలు


ఎదురుమొండి దీవులకు పడవలో వెళుతున్న సిబ్బంది

నాగాయలంక: మండలంలోని ఎదురుమొండి, నాచుగుంట, ఈలచెట్లదిబ్బ గ్రామాలు కృష్ణానది మధ్యలో ఉన్నాయి. ఈ గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేదు. పంటు, పడవలపై వెళ్లాల్సిందే. ఈ మూడు పంచాయతీల్లో మొత్తం ఆరు పోలింగ్ కేంద్రాల్లో 4,750 మంది ఓటర్లున్నారు. ఆ ప్రాంతాలకు ఎన్నికల సామగ్రిని, సిబ్బందిని పడవలపై చేరవేశారు. గత ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు వైఎస్సార్ సీపీ అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబుకి 20,754 ఓట్ల అఖండ మెజారిటీ కట్టబెట్టారు. ఈ సారి తిరిగి రమేష్ బాబు పోటీ చేస్తుండగా, కూటమి అభ్యర్థిగా జనసేన తరఫున మండలి బుద్ధప్రసాద్ బరిలో ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా అందె శ్రీరామమూర్తి, బీఎస్పీ అభ్యర్థిగా గుంటూరు నాగేశ్వరరావు, జైభీం పార్టీ తరఫున సముద్రాల అంబేడ్కర్, మరో ఐదుగురు ఇతర పార్టీలు, ఇండిపెండెంట్లుగా పోటీలో ఉన్నారు.

టీడీపీ అభ్యర్థి అరవిందబాబు ఏడుపు రాగం

కుటుంబ సభ్యుల మధ్య కూర్చొని వీడియో విడుదల

నరసరావుపేట: నరసరావుపేట అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఎన్నికల్లో గెలిచేందుకు ఏడుపు రాగం ఎంచుకున్నారు. మరి కొన్ని గంటల్లో ఎన్నికల పోలింగ్ జరుగుతుండగా ఆదివారం సాయంత్రం సానుభూతి కోసం తన గృహంలో కుటుంబ సభ్యుల మధ్య కూర్చొని తనను గెలిపించాలంటూ ఏడుపు నాటకం ఆడారు. 2019లో తాను ఓడిపోయినప్పటి నుంచి ప్రజల మధ్యనే ఉంటూ ఎండనక, వాననక తిరిగానని పేర్కొన్నారు. తనకు అన్నీ దార్లు మూసుకుపోయి ఇక గెలవననే అభిప్రాయానికి వచ్చిన ఆయన చివరి అస్త్రంగా సానుభూతితో ఓటర్ల మనస్సు గెల్చుకోవాలనే ప్రయత్నంలో భాగంగానే ఈ వీడియో ప్రజలకు విడుదల చేశారని పలువురు ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.

బీసీలకు మేలు చేసిన వారికి అండగా నిలుద్దాం

లబ్బీపేట(విజయవాడతూర్పు): బీసీలు అంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదని బ్యాక్‌బోన్ క్యాస్ట్‌గా పేర్కొంటూ మేలు చేసిన వారికి ఓటు ద్వారా అండగా నిలుద్దామని బీసీ సంఘ నేత కసగోని దుర్గారావుగౌడ్ పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ గతంలో బీసీల తోకలు కత్తిరిస్తామంటూ బెదిరింపులకు పాల్పడిన వారికి ఓటు ద్వారా బుద్ధి చెబుదామని పేర్కొన్నారు. బీసీల రాజ్యాధికారమే మన లక్ష్యమని, ఆ దిశగా రాజ్యాధికారంలో బీసీలను భాగస్వాములను చేస్తున్న వారికి రాష్ట్రంలోని బీసీలంతా అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు.

పెమ్మసానికి దిమ్మతిరిగేనా..

- గుంటూరు లోక్‌సభ పరిధిలో మహిళా ఓటర్లే అధికం
- వైఎస్సార్ సీపీ నుంచి నలుగురు మహిళా అభ్యర్థులు
- అందరూ రాజకీయ నేపథ్యం ఉన్నవారే
- సామాజిక న్యాయం పాటించిన అధికారపార్టీ
- టీడీపీ నుంచి మహిళా అభ్యర్థి ఒక్కరే
- బాబు సామాజికవర్గం నుంచి నలుగురు పోటీ


విడదల రజిని
గుంటూరు పశ్చిమ నియోజకవర్గం


మేకతోటి సుచరిత
తాడికొండ నియోజకవర్గం


నూరి ఫాతిమా
గుంటూరు తూర్పు నియోజకవర్గం


మురుగుడు లావణ్య
మంగళగిరి నియోజకవర్గం


రోశయ్య, ఎంపీ అభ్యర్థి
వైఎస్సార్ సీపీ


పెమ్మసాని చంద్రశేఖర్
టీడీపీ ఎంపీ అభ్యర్థి

సాక్షి,ప్రత్యేక ప్రతినిధి: కోటాను కోట్ల డబ్బులు ఉన్నాయని, ఎన్నిరకాల ప్రలోభాలకు గురిచేసైనా విజయం సాధించగలననే అహంకారంతో విర్రవీగుతున్న టీడీపీ లోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఓటర్లు కర్రుకాల్చి వాతపెట్టనున్నారనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేనల నుంచి లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు పోటీలోని అభ్యర్థుల రాజకీయ అనుభవం, కుటుంబ నేపథ్యం, సామాజిక స్థితిగతులను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోందని పరిశీలకులు అంటున్నారు. ఏడు అసెంబ్లీ స్థానాలలో తాడికొండ, గుంటూరు వెస్ట్, గుంటూరు ఈస్ట్, మంగళగిరిల నుంచి వైఎస్సార్ సీపీ నుంచి మహిళలు పోటీలో ఉన్నారు. టీడీపీ తరఫున గుంటూరు వెస్ట్ నుంచి మాత్రమే మహిళకు అవకాశం ఇవ్వడాన్ని గుర్తుచేస్తున్నారు. గుంటూరు లోక్‌సభ పరిధిలో 59 వేల మంది మహిళా ఓటర్లు అధికం. అభ్యర్థుల ఎంపికలో సామాజిక న్యాయం ఏమాత్రం పాటించలేదనే వ్యతిరేకత టీడీపీపై వ్యక్తమవుతోంది. రాజకీయ చైతన్యం మెండుగా కలిగిన లోక్‌సభ స్థానంగా గుంటూరుకు గుర్తింపు ఉంది. గత ఎన్నికల్లోనూ గల్లా జయదేవ్ 4205 స్వల్ప మెజార్టీతో గట్టెక్కిన సంగతి తెలిసిందే.


గల్లా మాధవి(టీడీపీ)

ఏడింటిలో ఏ ఒక్కరికైనా...

తెలుగుదేశం పార్టీ అభ్యర్థులుగా పోటీపడుతున్న వారిలో గుంటూరు లోక్‌సభ స్థానానికి పెమ్మసాని చంద్రశేఖర్, మంగళగిరి నుంచి నారా లోకేష్, పొన్నూరు నుంచి ధూళిపాళ్ల నరేంద్రకుమార్, తెనాలి నుంచి నాదెండ్ల మనోహర్ (జనసేన)లు ఒకే సామాజికవర్గానికి చెందిన వారే. గుంటూరు వెస్ట్ నుంచి రంగంలో ఉన్న గల్లా మాధవి భర్త కూడా బాబు సామాజికవర్గీయుడే. ఆమెను కూడా పై కోటాకు చెందిన అభ్యర్థిగా పరిగణలోకి తీసుకోవాల్సిందేనని టీడీపీ వర్గీయులే అంటున్నారు. సాధారణంగా ప్రధానపార్టీలు గుంటూరు ఈస్ట్ నుంచి ముస్లింలకు అవకాశం కల్పిస్తుంటాయి. ఇక తాడికొండ, ప్రత్తిపాడు రిజర్వుడు స్థానాలు కావడంతో ఆ సామాజికవర్గాల వారికి ఇవ్వక తప్పదు. మొత్తం మీద ఏడింటిలో నాలుగు స్థానాలలో పోటీకి బాబు తమ వారికే అవకాశం ఇవ్వడాన్ని టీడీపీలోని ఇతర సామాజికవర్గాల వారు ముఖ్యంగా కాపులు తీవ్రస్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. వైఎస్సార్ సీపీ నుంచి అభ్యర్థుల ఎంపికలో సామాజికన్యాయం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. తాడికొండ, ప్రత్తిపాడుల నుంచి రిజర్వుడు, గుంటూరు ఈస్ట్ నుంచి ముస్లింలు పోటీలో ఉన్నారు. గుంటూరు లోక్‌సభ, పొన్నూరు అసెంబ్లీ స్థానాలకు కిలారు వెంకటరోశయ్య, అంబటి మురళీకృష్ణలు పోటీలో ఉన్నారు. వీరివురు కాపు సామాజికవర్గీయులు కాగా తెనాలి నుంచి అన్నాబత్తుని శివకుమార్ పోటీలో ఉన్నారు.

మహిళలకు అత్యధిక ప్రాధాన్యం...

తాడికొండ (ఎస్సీ) స్థానం నుంచి పోటీలో ఉన్న మేకతోటి సుచరిత మాజీ హోం మంత్రి. ఆమె రాజకీయ అరంగేట్రం స్థానిక సంస్థల ఎన్నికల (జడ్పీటీసీ)లో జరిగింది. సుమారు రెండు దశాబ్దాలుగా రాజకీయాల్లో కొనసాగుతూ ఎమ్మెల్యేగా, హోంమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. బీసీ వర్గానికి చెందిన విడదల రజని వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా కొనసాగుతూ గుంటూరు వెస్ట్ నుంచి పోటీలో ఉన్నారు. మంగళగిరి నుంచి రంగంలో ఉన్న మురుగుడు లావణ్య పుట్టినిల్లు, మెట్టినిల్లు రాజకీయ కుటుంబాలే. ఆమె తల్లి కాండ్రు కమల మాజీ ఎమ్మెల్యే కాగా, మామయ్య మురుగుడు హనుమంతరావు మాజీ మంత్రి. గుంటూరు తూర్పు అభ్యర్థిని షేక్ నూరిఫాతిమా తండ్రి ముస్తఫా ప్రస్తుతం ఎమ్మెల్యే. ప్రతిపాడు నుంచి బలసాని కిరణ్‌కుమార్, పొన్నూరు నుంచి అంబటి మురళీకృష్ణ తొలిసారి పోటీపడుతున్న సంగతి తెలిసిందే.

17.93 లక్షల ఓటర్లులో...

గుంటూరు లోక్‌సభ పరిధిలో 17,93,324 ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 8,67,085, మహిళా ఓటర్లు 9,26,080 ఉన్నారు. అంటే 58,995 మంది మహిళా ఓటర్లు అధికం. వైఎస్సార్ సీపీకి మహిళా ఓటర్ల మద్దతు శాతం అధికమని వివిధ సర్వేలు ఇప్పటికే పలుసార్లు వెల్లడించాయి. మంగళగిరిలో 10,983, తెనాలిలో 9,167, ప్రత్తిపాడులో 8,993, పొన్నూరులో 8,627, తాడికొండలో 7,229, గుంటూరు వెస్ట్‌లో 7,118, గుంటూరు ఈస్ట్‌లో 6,878 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. మహిళ అభ్యున్నతి కోరుకుంటూ వారిని పలు పథకాల ద్వారా సహాయం అందజేస్తున్న జగన్ సర్కారు మహిళల పక్షపాతమనే ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ ఎన్నికల్లో మహిళా ఓటర్లలో మెజార్టీ వైఎస్సార్‌సీపీ వైపు ఉన్నారని ఇప్పటికే అనేక సర్వేలు వెల్లడించాయి. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకున్నట్లయితే టీడీపీ అసెంబ్లీ అభ్యర్థులతో పాటు లోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌కు దిమ్మతిరిగే ఫలితాలు తప్పవని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

మరోసారి వారే ప్రత్యర్థులు

- వైఎస్సార్ సీపీ నుంచి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- టీడీపీ నుంచి జూలకంటి బ్రహ్మారెడ్డి
- రెండుసార్లు ఓడిన జూలకంటి


పిన్నెల్లి రామకృష్ణారెడ్డి


జూలకంటి బ్రహ్మారెడ్డి

మాచర్ల: మాచర్ల నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి మరోసారి ప్రత్యర్థులుగా ఉన్నారు. నాలుగుసార్లు పోటీ చేసిన ప్రభుత్వ విప్ పీఆర్కే నాలుగు సార్లూ విజయం సాధించారు. బ్రహ్మారెడ్డి ఇప్పటికే రెండుసార్లు ఓటమి పాలయ్యారు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తన ప్రత్యర్థి టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిపై 9,600 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2012 ఉప ఎన్నికలల్లో టీడీపీ అభ్యర్థి చిరుమామిళ్ల మధుపై వైఎస్సార్ సీపీ అభ్యర్థి పీఆర్కే 16వేల పై చిలుకు ఓట్లతో గెలుపొందారు. 2014 టీడీపీ అభ్యర్థి కొమ్మారెడ్డి చలమారెడ్డిపై పీఆర్కే 3,535 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2019లో టీడీపీ అభ్యర్థి అన్నపురెడ్డి అంజిరెడ్డి పై పీఆర్కే 23వేలకు పైగా ఓట్లతో గెలుపొందారు. బ్రహ్మారెడ్డి 2004లో టీడీపీ తరఫున పోటీచేసి 31వేల ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి పిన్నెల్లి లక్ష్మారెడ్డి చేతిలో ఓడిపోయారు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేతిలో ఓటమిపాలయ్యారు. మూడో సారి టీడీపీ తరఫున బరిలో దిగిన బ్రహ్మారెడ్డి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.